క్లుప్తంగా

ఆటో బోల్తా.. పలువురికి గాయాలు

వర్ధన్నపేట : వరంగల్ నుంచి వర్ధన్నపేటకు వెళ్తున్న ఆటో మంగళవారం ఇల్లంద గ్రామంలోని స్వామి వివేకానంద విగ్రహం సమీపంలో మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురితో పాటు ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కాగా క్షతగాత్రులను వెంటనే 108 లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి..

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయగూడెం గ్రామానికి చెందిన బోడ అంకు వ్యక్తిగత పని నిమిత్తం నర్సంపేట మండలంలోని ముత్తోజిపేటకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు ప్రాథమిక చికిత్స నిర్వహించి వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు.

పేదలకు అండగా ప్రభుత్వం



ఐనవోలు : బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటోందని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తెలిపారు. మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన కట్కూరి మాణిక్యం అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ కాన్సెంట్ (ఎల్‌ఓసీ)ని ఆయన కుటుంబానికి హనుమకొండలోని తన నివాసంలో ఎమ్మెల్యే మంగళవారం అందజేసి మాట్లాడారు. ఆరోగ్యశ్రీలో అందని వైద్యం కోసం ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందితే పేదలకు ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నుంచి సాయం అందిస్తుందని తెలిపారు. పేదలు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) జిల్లా డైరెక్టర్ కట్కూరి రాజు, నాయకులు బెన్‌సన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ నూతన కమిటీ ఎన్నిక

హన్మకొండ: మున్నూరు కాపు సంఘం 51వ డివిజన్ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్త దశరథం తెలిపారు. మంగళవారం హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలో డివిజన్ మున్నూరు కాపు సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో డివిజన్ అధ్యక్షురాలిగా గంగుల వినోద, ఉపాధ్యక్షులుగా జిలకల దుర్గారావు పటేల్, రాకం ప్రవీణ్ పటేల్, కారంగుల వాణి, ప్రధాన కార్యదర్శిగా నిమ్మకాయల వెంకట్ పటేల్, సహాయ కార్యదర్శులుగా అడప రాజు పటేల్, కొప్పుల సతీష్ పటేల్, కోశాధికారిగా పత్రి శ్రీకాంత్ పటేల్ ఎన్నికయ్యారని వివరించారు. వీరితో పాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారని వివరించారు. ఈ మేరకు కమిటీ వివరాలను అధ్యక్షురాలు గంగుల వినోదకు అందించారు.

టీవీ టవర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్..
హనుమకొండలోని టీవీ టవర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నల్ల సుధాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా పల్లెపాటి సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎండపెల్లి కిషన్‌రెడ్డి, కోశాధికారిగా పూజారి మనోజ్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నోముల మల్లారెడ్డి, కన్నెబోయిన బిక్షపతి, కొయ్యడ అంజయ్య గౌడ్, సహ కార్యదర్శులుగా రావుల బుచ్చి రెడ్డి, బిల్లకంటి నర్సింగరావు, గరిగె సురేందర్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'కాషాయ జెండా ఎగురవేయాలి'



హసన్‌పర్తి : రానున్న సాధారణ ఎన్నికల్లో తెలంగాణలో కాషాయపు జెండా ఎగురవేయడానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ పిలుపునిచ్చారు. డివిజన్ బీజేపీ కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు మేకల హరిశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి శివకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రధాని మోదీ భారతదేశాన్ని విశ్వగురుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారపల్లి రాంచెంద్రారెడ్డి, మాజీ వార్డు సభ్యులు తాళ్లపల్లి రమేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి తంగళ్లపల్లి రమేష్, నాయకులు సుమన్, లలిత, సత్యప్రకాష్, సత్యం, సురేందర్. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంటా కాదు.. మిల్లుకు చేరదు



చెన్నారావుపేట: కొనుగోలు కేంద్రంలో..



ఖానాపురంలో..



సంగెం: కాపులకనిపర్తిలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న రైతులు



పర్వతగిరి: ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం

- వర్షంతో తడిసిన ధాన్యం
- అన్నదాతల రాస్తారోకో, ధర్నా

చెన్నారావుపేట /సంగెం / ఖానాపురం/ పర్వతగిరి : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు తీసుకువస్తే కాంటా కావడం లేదు.. కాంటా అయినా ధాన్యాన్ని వాహనాలు లేవనే సాకుతో మిల్లుకు చేర్చడం లేదు. దీంతో నెల రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసుకొని పడిగాపులు కాస్తున్నా రైతులకు మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ధాన్యం తడవడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే సంగెం మండలంలోని కాపులకనిపర్తి వద్ద వరంగల్–మహబుబాబాద్ ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం వరకు ధాన్యం కాంటాలు వేయకుండా, మిల్లుల వద్ద దిగుమతి చేసుకోకుండా మిల్లర్లు, వేబ్రిడ్జి నిర్వాహకులు తాళాలు వేసి వెల్లడంతో రెండు రోజులుగా పడిగాపులు కాస్తున్న అన్నదాతల ఆగ్రహించారు. దీంతో ధాన్యం కాంటాలు వేసి దిగుమతి చేసుకోవాలని నినాదాలు చేస్తు రోడ్డుపై ఆందోళన చేశారు. పర్వతగిరి మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఐకేపీ కొనుగోలు కేంద్రంలో రైతుల ధాన్యం తడిసి ముద్దయింది. ఇప్పటికైనా అధికారులు ధాన్యం కాంటాలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఖానాపురం మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం కురిసిన వర్షంతో రైతులు ఆగమయ్యారు. వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు టార్పాలిన్లను కప్పుకున్నారు. అయినప్పటికి ధాన్యం తడిసిపోయింది. బస్తాల్లో నింపిన ధాన్యం సైతం అశోక్‌నగర్, ఖానాపురంతో పాటు పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయాయి. దిగుమతులకు తీసుకువచ్చిన ధాన్యాన్ని తడవకుండా ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై టార్పాలిన్ల సాయంతో కాపాడుకున్నారు. ఓ వైపు వర్షాలు కురుస్తున్నప్పటికీ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని మాత్రం పూర్తిగా కొనుగోలు చేయకుండా పాలకవర్గాలు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మిల్లర్లు ఇబ్బంది పెట్టొద్దు
వర్షంతో పైపైన తడిసిన ధాన్యాన్ని తీసుకోకుండా మిల్లర్లు ఇబ్బందులు పెట్టొద్దని ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని మంగళవారం పరిశీలించారు. అనంతరం పాలకవర్గ సభ్యులతో కలిసి హమాలీలో మాట్లాడి బస్తాలు ఎత్తించారు.

తడిసిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలి

కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు

చెన్నారావుపేట/దుగ్గొండి: అకాల వర్షానికి తడిసిన ధాన్యం, మొక్కజొన్నలను ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా బేషరతుగా కొనుగోలు చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దుగ్గొండి మండలంలోని వెంకటాపురం, గోపాలపురంలో ఏర్పాటు చేసిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వారు మంగళవారం సందర్శించారు. అలాగే చెన్నారావుపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ధర్నా, రాస్తారోకో చేశారు. దీంతో గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై తోట మహేందర్ ధర్నా వద్దకు చేరుకుని రైతులు, నాయకులతో మాట్లాడి ధర్నా విరమింపచేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, దుగ్గొండి, నర్సంపేట మండలాల అధ్యక్షులు ఎర్రళ్ల బాబు, లక్ష్మణ్‌నాయక్, బత్తిని రాజేందర్, జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, మంద యాకయ్య, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ణాటి పార్వతమ్మ, తూటి పావని, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఇంద్రదేవ్, చెన్నూరి కిరణ్‌రెడ్డి, కత్తి కిరణ్, రామారావు, ఇంగోళి రాజేశ్వర్‌రావు, పెండ్యాల రాజు, ఎడెల్లి శ్రీనివాసరెడ్డి, ఆవుల నర్సింహారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, పాల్గొన్నారు.



చెన్నారావుపేట: ధర్నా చేస్తున్న నాయకులు

నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి
పర్వతగిరి : తాలు, తేమ పేరుతో రైతులను నిలువు దోపిడీ చేస్తున్న మిల్లర్లు, మార్కెటింగ్ శాఖ, ఐకేపీ సెంటర్ నిర్వాహకులపై కలెక్టర్ తక్షణమే చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం కురిసిన వర్షంతో ధాన్యం తడువగా వ్యవసాయ మార్కెట్‌ను రైతులతో కలిసి సందర్శించి ధైర్యం చెప్పారు.

కుటీర పరిశ్రమలతో ఆర్థికాభివృద్ధి



మగ్గం వర్క్‌ను ప్రారంభిస్తున్న కిషన్ తదితరులు

నర్సంపేట : కుటీర పరిశ్రమలతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందవచ్చని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుంటి కిషన్ అన్నారు. ఈ మేరకు ఎఫ్ఎం సాంఘిక సేవా సంస్థ వరంగల్ సహకారంతో ఛాయా సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం 12వ వార్డు పరిధిలో కౌన్సిలర్ ఎండి.పాషా అధ్యక్షతన మైనార్టీ, ఇతర మహిళలకు ఉచిత మగ్గం శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎస్సీ, ఎస్టీల తర్వాత మైనార్టీలు ఆర్థికంగా పురోగమనము చెందడం లేదని దీనికి ఉపాధి, విద్యా అవకాశం లేకపోవడం కారణమన్నారు. శిక్షణ కార్యక్రమాల అనంతరం చిన్న కుటీర పరిశ్రమలు స్థాపించుకొని ఆర్థిక చైతన్యం పొందవచ్చని సూచించారు. మహిళలు నేర్చుకున్న శిక్షణకు అనుగుణంగా అధికారులు, బ్యాంకర్లు, నియోజకవర్గ ఎమ్మెల్యే సహకారంతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తగిన ప్రయత్నం చేస్తామని తెలిపారు. కరుణ, శ్రీకాంత్, ఎండి.గౌస్‌బేగం, కోట డేవిడ్, లక్ష్మినారాయణ, లక్ష్మి ఉన్నారు.

సేవలు అభినందనీయం

కాజీపేట రూరల్ : కాజీపేట లోడి సాంఘీక సేవా సంస్థ కార్యాలయంలో మంగళవారం లోడి డైరెక్టర్ ఫాదర్ డి.విజయపాల్‌రెడ్డికి వీడ్కోలు, హుస్నాబాద్ సేయింట్ జోసెఫ్ స్కూల్ ప్రిన్స్‌పాల్ ఎస్.ఇన్నారెడ్డికి స్వాగత కార్యక్రమం నిర్వహించారు. జనగాం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కాలేజ్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న విజయపాల్‌రెడ్డి, జోసెఫ్ స్కూల్ ప్రిన్స్‌పాల్‌గా పని చేస్తున్న ఫాదర్ ఇన్నారెడ్డి లోడి సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు ఫాదర్లకు లోడి సంస్థ సిబ్బంది పూలబొకేలు అందజేసి సన్మానం చేశారు. కార్యక్రమంలో లోడి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను కూల్చివేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కుండె మల్లయ్య, వార్డు సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో భాగంగా సదరు కాంట్రాక్టర్‌కు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నామన్నారు. గ్రామ సభలో ప్రజాభిప్రాయం మేరకు 38 ఫీట్ల వరకు ఒప్పందం కుదుర్చుకుని పనులు చేపట్టినట్లు తెలిపారు. 70సంవత్సరాలకు పైగా ప్రయాణికులకు సౌకర్యంగా ఉన్న బస్టాండ్‌ను ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండా కూల్చడం సరికాదన్నారు. రోడ్డు వెడల్పునకు సహకరిస్తుండగా దౌర్జన్యంగా కూల్చడం తగదన్నారు. బస్టాండ్‌ను తిరిగి నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సతీష్, శ్రీధర్‌రెడ్డి, బండి ఉపేందర్, గొడిశాల సురేందర్, గట్ల రాంబాబు, మరాటి నర్సయ్య, తదితరులు ఉన్నారు.

సన్మానం

పర్వతగిరి : మండలంలోని నారాయణపురం బ్రాంచ్ పోస్టు మాస్టర్ గంట స్వప్న ఉత్తమ సేవలు అందించినందుకు వరంగల్ పోస్టల్ సూపరింటెండెంట్ నర్సింహారావు మంగళవారం శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ వరప్రసాద్, ఐపీఓ సుమన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న అజ్మీరా సీతారాం నాయక్

నల్లబెల్లి : మాజీ ఎంపీపీ బానోత్ సారంగపాణి తల్లి గూమ్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ మంగళవారం పరామర్శించారు. గూమ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ వక్కల మల్లక్క, ఎంపీటీసీ ఒదేల విజయ, కారుకూరి శ్రీనివాస్, మోర్తాల రామారావు, వక్కల తిరుపతి, పాగుల పైడి చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

వర్ధన్నపేట : వర్ధన్నపేటలోని పిరంగిగడ్డ ప్రాంతంలో గల పొలాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని రైతు బొంత సోమయ్య ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. ఈ విషయంపై విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని కోరుతున్నాడు.

హక్కుల కోసం నిరంతర పోరాటం



సంగెం: మాట్లాడుతున్న రాజు



నెక్కొండ: జెండా ఆవిష్కరిస్తున్న వెంకటయ్య

సంగెం : కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తామని సీఐటీయూ మండల కన్వీనర్ దుపాటి రాజు అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులను, శ్రమను దోచుకుంటున్న దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పోలబోయిన శ్రీనివాస్, చిర్ర శోభన్‌బాబు, సాంబయ్య, సత్యం, కోర్నెలు, అశోక్, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం
నెక్కొండ : సీఐటీయూ ఆవిర్భావ స్ఫూర్తితో ఉద్యోగ, కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని తెలంగాణ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సీఐటీయూ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక వర్గాల ఐక్యతను విచ్ఛినం చేసి, కార్పొరేట్ సంస్థలకు రెడ్ కార్పెట్ పరిచే మత తత్వశక్తులకు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు. కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను అవలింభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసిస్తూ ర్యాలీలు, ధర్నాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్యా నరేష్, ప్రధాన కార్యదర్శి చెలకలపల్లి వీరస్వామి, ఉపాధ్యక్షుడు ఈదునూరి సాయిలు, నాయకులు మధార్, ఈదునూరి భిక్షపతి, యాకయ్య, ఆదిరెడ్డి, నగేష్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలి

వర్ధన్నపేట : డీసీసీ అధ్యక్షురాలిగా ఎన్నికైన ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు పదవీ బాధ్యత స్వీకార కార్యక్రమం నేడు(బుధవారం) వరంగల్ నగరంలోని అబ్బాస్ ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య తెలిపారు. కాగా వర్ధన్నపేట మండలం నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని వెంకటయ్య పిలుపునిచ్చారు. అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుజ్జ రవీందర్‌రెడ్డి, వడ్లకొండ ఎల్లగౌడ్, ఎర్ర శ్రీకాంత్, బంగారు సదానందం, చెదల శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



పానీష్‌తండాలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

రాయపర్తి : మండలకేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని అధ్యాపకులు తెలిపారు. మంగళవారం మండలంలోని పానీష్‌తండా, కొత్తతండా గ్రామాల విద్యార్థులు మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పొందాలన్నారు. ఈ సందర్భంగా పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. తమ పిల్లలను ప్రైవేట్ కళాశాలకు పంపించి అప్పుల పాలు కావొద్దని ప్రభుత్వ కళాశాలలో నిష్ణాతులైన అధ్యాపకులతోపాటు సదుపాయాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాజిరెడ్డి, రాజు, నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలి



సంగెం: మాట్లాడుతున్న ఎంపీపీ కళావతి

సంగెం : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ కళావతి పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై ఆయా శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 3వ తేదీన నిర్వహించే రైతు దినోత్సవం, 8వ తేదీన నిర్వహించే ఊరురా చెరువుల పండుగలో రైతులు, ప్రజలు పూర్తిస్థాయిలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వివిధ వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించేలా ఫ్లెక్సిలు, బ్యానర్లు, ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత జరిగిన అభివృద్ధిని పల్లె ప్రగతి నాడు–నేడు అనే శీర్షికన తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ కొమురయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలపై వీడియో కాన్ఫరెన్స్
రాయపర్తి : జూన్ 2నుంచి 22వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు ఆకుల సురేందర్‌రావు, తహసీల్దార్ కుసుమ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, ఏఓ గుమ్మడి వీరభద్రం, సర్పంచ్‌లు గోవర్ధన్‌రెడ్డి, కోదాటి దయాకర్ రావు, అనంత, చిన్నాల తారశ్రీరాజబాబు, చిన్నాల వనజ, చెడుపాక కుమారస్వామి, కుంచారపు హరినాథ్, మంజ్యా, హనుమ పాల్గొన్నారు.

రక్తదానశిబిరం

హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలం భీమారంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక రోమన్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ సీహెచ్‌సీ, పరకాల బ్లడ్ బ్యాంక్ సహకారంతో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రైతు బంధు సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడు సంగాల విక్టర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యవంతులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలన్నారు. డాక్టర్ అరుణ్‌కుమార్, చర్చి ప్రెసిడెంట్ సంగాల ప్రేమ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ రమేష్, సెక్రటరీ పరమేష్, స్థానికులు ప్రసాద్, రాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన పూజలు



నర్సంపేట రూరల్ : దాసరిపల్లిలో గంగమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



దుగ్గొండి: తిమ్మంపేట యోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో..

దుగ్గొండి : మండలంలోని తిమ్మంపేటలో శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన పూజలు సాగుతున్నాయి. బుధవారం స్వామివారికి అభిషేకం, బొడ్రాయి వద్ద గుమ్మడికాయ, గరుడ యంత్ర, నవగ్రహ పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మోడెం విద్యాసాగర్–ప్రశాంతి దంపతులు, అర్చకులు ఆనంద్‌కుమార్, అరుణ్‌కుమార్, రాంకీచార్యులు, వేదపండితులు, గ్రామపెద్దలు, వివిధ కుల సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు
నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని దాసరిపల్లిలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం గంగమ్మతల్లి, ఎల్లమ్మతల్లి, కోటిలింగాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐలయ్య, మేర్గు ఐలయ్య, రాజు, మల్లేష్, మల్లేష్, రవి, వంగ కొమురయ్య, మేకల సాంబయ్య, గొల్ల రాగాలు తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



చెన్నారావుపేట : నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని నెహ్రూ యువకేంద్రం వలంటీర్ జాటోత్ వినోద్ నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. ఈ మేరకు మండలంలోని పత్తినాయక్ తండా, జల్లీలో నేషనల్ వాటర్ మిషన్, మినిస్ట్రీ ఆఫ్ జల్‌శక్తి, మేరీ లైఫ్ మేరా షహర్ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. అనంతరం ప్రజలతో నీటి పొదుపుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధం, వర్షపు నీరు ఒడిసి పట్టుకోవడం, పరిసరాల పరిశుభ్రత, పెరటి తోట పెంపకం, చెరువుల్లో పూడిక తీత, పాంపాండ్స్, ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్, ఆశ వర్కర్లు తదితరులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పి.చంద్రశేఖర్ (A.C.O): 8074606274